

రాత్రివేళల్లో భయంగా ఉంది

పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో రాత్రి వేళల్లో తగిన భద్రత లేకపోవడం వల్ల భయం భయంగానే వైద్యం అందించాల్సి వస్తోంది. ఆస్పత్రిలోనే పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి తగిన సిబ్బందిని నియమించి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి వేళ డ్రంకన్ కేసులు, యాక్సిడెంట్ కేసులు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మద్యం తాగి కొందరు ఆస్పత్రికి రాత్రివేళ వైద్యం కోసం వస్తుంటారు. ఇది సమస్యగా మారుతోంది.

– జయశ్రీ, హెడ్ నర్స్, ప్రభుత్వ ఆస్పత్రి, పెనుకొండ



గుంపులుగా వస్తున్నారు

పెనుకొండ ప్రభుత్వాస్పత్రి జాతీయ రహదారికి సమీపంలోనే ఉంది. దీంతో రాత్రివేళ రోడ్డు ప్రమాద కేసుల్లో ఒకేసారి 30 నుంచి 40 మందితో ఆస్పత్రి నిండిపోతోంది. వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్స కూడా అందించలేని పరిస్థితి. దీనికి తోడు వచ్చిన వారిలో కొందరు గొడవకు దిగుతున్నారు. మద్యం సేవించిన వారైతే ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భయపడుతూనే చికిత్స చేయాలి. పోలీసులతో భద్రత కల్పించాలి.

– డాక్టర్ యమీమ్, ప్రభుత్వ ఆస్పత్రి ,పెనుకొండ



ఉల్లి రేటు .. వెల్లుల్లి ఘాటు

- సరుకు తగ్గడంతో పెరుగుతున్న రేట్లు
- తగ్గించి కొనాల్సి వస్తోందంటున్న వినియోగదారులు




హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన ఉల్లి, వెల్లుల్లి

హిందూపురం అర్బన్: ఉల్లి లొల్లి మళ్లీ మొదలైంది. కేజీ రూ.60కి పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉల్లి మార్కెట్ లేకపోవడం బయట మార్కెట్ల నుంచి సరకు తీసుకొచ్చి అనంతపురం, హిందూపురం మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి పట్టణాలకు సరుకు రవాణా చేస్తున్నారు. అయితే సరుకు మార్కెట్‌కు రావడం తగ్గడంతో ఆ ప్రభావం ధరలపై పడుతోంది.

సరుకు దిగుమతి కాకపోవడంతోనే..

ఉల్లిగడ్డలు మహారాష్ట్రలో ఎక్కువగా పండుతుండగా భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గి ధర్పై ప్రభావం చూపుతోంది. మార్కెట్‌లో గడిచిన ఆరు నెలల్లో ఉల్లి ధరలు హెచ్చు తగ్గులుగా ఉన్నాయి. మహారాష్ట్ర మార్కెట్ నుంచి బెంగళూరులోని యశ్వంతపుర మార్కెట్‌కు వస్తుంది. అక్కడి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాకు తరలిస్తుంటారు. అయితే బెంగళూరు యశ్వంతపుర మార్కెట్‌కు ఉల్లి సరుకు తక్కువగా వస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాకు రోజూ 20–30 లారీల సరుకు రావాల్సి ఉండగా.. కేవలం 10–12 లారీల సరుకు మాత్రమే వస్తోంది. ఇక .. కర్నూలు రకం ఉల్లి మార్కెట్‌కు రావాలంటే మరో నెల ఆగాలని వ్యాపారస్తులు చెబుతున్నారు. మహారాష్ట్ర సరుకు యశ్వంతపుర మార్కెట్‌లో సాధారణ రకం క్వింటా రూ. 3,800, మధ్యరకం రూ.4,400, మొదటి రకం రూ.4,800 పలుకుతోంది. దానికితోడు మళ్లీ రవాణా ఖర్చులు తోడవుతున్నాయి. దీంతో చిల్లరగా కిలో ఉల్లి రూ.60 అమ్మక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఉల్లి ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. డిమాండ్‌కు అనుగుణంగా లక్షల టన్నులు బెంగళూరుకు తెప్పిస్తోంది. నవంబర్ వరకూ ఉల్లి ధరల్లో వ్యత్యాసం ఉండొచ్చని టోకు వ్యాపారులు చెబుతున్నారు.

వెల్లుల్లి ధర కూడా పైపైకి...

మార్కెట్‌లో కిలో వెల్లుల్లి (తెల్ల గడ్డలు) బెంగళూరు మార్కెట్‌లో రూ.230 వరకూ పలుకు తున్నాయి. వ్యాపారులు అక్కడి నుంచి తీసుకొచ్చి కిలో రూ.280 నుంచి రకాన్ని బట్టి రూ.330 వరకూ అమ్మకం చేస్తున్నారు. మొదటి రకం మరో రూ. 350 వరకూ వినియోగదారులు కొనాల్సి వస్తోంది. మార్కెట్‌లో గతంలో 5 కిలోల వరకు ఎర్ర గడ్డలు కొనే వినియోగదారులు ఇప్పుడు ధరలు పెరగడంతో రెండు కిలోలతో సర్దుకొంటున్నారు.

మార్కెట్‌లో ఉల్లికి డిమాండ్



మార్కెట్‌లో ఉల్లిగడ్డలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అందుకు అనుగుణంగా మాత్రం సరుకు సరఫరా లేదు. దీంతో ధర పెంచి కొని తీసుకు రావాల్సి వస్తోంది. కర్నూలు మార్కెట్‌కు సరుకు వచ్చేందుకు మరో 20 రోజుల పైనే పడుతుంది. అంత వరకూ బెంగళూరు నుంచి తీసుకు రావాల్సిందే. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఉల్లిగడ్డలు రూ.3400–4800 వరకు రకాన్ని బట్టి ఉన్నాయి.

– ఉదయ్‌కుమార్, ఉల్లి గడ్డల వ్యాపారి. చిలమత్తూరు.

తగ్గించి కొంటున్నాం



మార్కెట్‌లో గత నెల వరకూ ఉల్లిగడ్డలు కిలో రూ.30కి మంచి గడ్డలు దొరికేవి. ఇప్పుడు రూ.60 కు పెంచారు. దీంతో తగ్గించి కొనాల్సి వస్తోంది. వెల్లుల్లి గడ్డలు కిలో రూ.300కి పైగా పలుకుతున్నాయి. దీంతో పావు కిలోకి మించి కొనలేని పరిస్థితి. ప్రభుత్వం ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలి.

– అరుణాదేవి, గృహిణి, హిందూపురం.

25న వేమన సాహితీ యాత్ర

పెనుకొండ: కదిరి నియోజకవర్గ పరిధిలోని కటారుపల్లి తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఈ నెల 25న వేమన సాహితీ యాత్రను జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా తెలిపారు. చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రజాకవి వేమన తెలుగుభాషకు పట్టుగొమ్మ లాంటి వారన్నారు. వేమన పద్యాలు సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయన్నారు. వేమన ద్వారా తెలుగు భాష కీర్తి ప్రపంచమంతా వ్యాపించిందన్నారు. తెలుగు భాష మనుగడ కోసం, తెలుగు పద్యం గొప్పదనాన్ని చాటడం కోసం వేమన సాహితీయాత్రను జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చదువులుబాబు, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, ఏడీ రజిత, పెద్ద ఎత్తున కవులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమరాపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శుక్రవారం శిర రోడ్డుకు చెందిన నారాయణప్ప దగ్గరి నుంచి 316 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ రామంజనేయులు తెలిపారు. మడకశిర కోర్టుకు హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు పంపారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పరిగి: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేకపోతే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాలువపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం నూతనంగా ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించిన రంగడు యాదవ్‌ను ఆటో డ్రైవర్లు ఘనంగా సన్మానించారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

హిందూపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలో సూరప్పకట్ట వద్ద బోయకొండ గంగమ్మ దేవి, డీబీ కాలనీలోని అష్టలక్ష్మి, కొల్హాపూరీ మహాలక్ష్మిదేవి, రైల్వేరోడ్డులోని పులేకమ్మ ఆలయం, సూరప్పకట్ట వద్ద మారెమ్మదేవి, గంగాదేవి, బెంగళూరురోడ్డు పెద్దమ్మ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆయా ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు.

వ్యవసాయ తోటలో కేబుల్ చోరీ

అమరాపురం: మండలంలోని మద్దనకుంట గ్రామ సమీపంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి వ్యవసాయ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ చోరీ చేశారు. మూడు రోజుల నుంచి వరుసగా కేబుల్ చోరీకి గురవుతున్నట్లు తిప్పేస్వామి తెలియజేశారు. కావాలనే ఈ పని చేస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. వైరు దొంగతనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. తనకు వ్యక్తిగత కక్షలు లేవని, అయితే ఎవరో కావాలనే ఈ పని చేస్తున్నారన్నారు. కొత్త కేబుల్ వేసిన మరుసటి రోజే మళ్లీ అపహరించుకెళ్తున్నారన్నారు.

భారతీయ కిసాన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సోమశేఖర్‌రెడ్డి

హిందూపురం: భారతీయ కిసాన్ యూనియన్ (ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన జి.సోమశేఖర్‌రెడ్డిని నియమించారు. ఈమేరకు యూనియన్ నేషనల్ జనరల్ సెక్రటరీ ముస్తక్ వాజిత్ అలీ నియమిస్తూ పత్రాన్ని అందించారని సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జామియా ఈద్గా సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారన్నారు.

నేడు అన్న సంతర్పణ

చిలమత్తూరు: మండలంలోని మదిరేపల్లి గ్రామంలో వెలసిన బైలాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



పద్మనాభరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

గోరంట్ల (సోమందేపల్లి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభరెడ్డిని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఎర్రజవల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచ్ ప్రభాకర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగే నాయక్, నూర్ మహ్మద్, బాబు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అశ్వర్థప్ప, రామచంద్ర ఇటీవల వివిధ అనారోగ్యాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకరనారాయణ శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు అశ్వర్థప్ప కుమారుడు బోయ రమేష్, రామచంద్ర కుటుంబ సభ్యులకు రూ.20 వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

- ఇసుక, మట్టి తరలింపు అంశాలు చర్చకు వచ్చే అవకాశం



పరిగిలోని ఎంపీడీఓ కార్యాలయం

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన జరగాల్సిన మండల మీట్ కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో 24వ తేదీ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటూ మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని కోరారు. గత మూడు నెలలుగా మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల నివేదికతో పాటూ వచ్చే మూడు నెలల కాలపరిమితిలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

జోరుగా ఇసుక, మట్టి తరలింపు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికైన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులంతా మండల సమస్యలపై ఏకవాక్య తీర్మానంతో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రజల మన్ననలు పొందారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండు నెలలుగా మండలంలో విచ్చలవిడిగా ఇసుక, మట్టి అక్రమ తరలింపు ఊపందుకుంది. ఈ వ్యవహారంపై సభలో వాడివేడీగా చర్చజరిగే అవకాశం ఉందని కొందరు సభ్యులు చెబుతున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మండలంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వహణ లోపంపై అధికారులు ఏమని సమాధానం చెబుతారో చూడాలని చెబుతున్నారు. మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఇటీవల మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్ష సమావేశాలను నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని పిలుపిచ్చిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు ఉద్యమాలను చేపట్టాలని, ఇందుకు సరైన వేదిక మండల మీట్ అని చెబుతున్నారు. ఇందులో భాగంగానే శనివారం జరిగే సర్వసభ్య సమావేశంలో అందరూ దృష్టిసారించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అమరాపురం: పదోతరగతి విద్యార్థులు ఇప్పటి నుంచి క్రమశిక్షణతో చదువుకుని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ 1 రాఘవయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏఏ సబ్జెక్టుల్లో సిలబస్ ఎంత వరకూ పూర్తి చేశారు. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో బాగా చదువుకోవాలన్నారు. వచ్చే సంవత్సరం జరగబోయే పబ్లిక్ పరీక్షలో తామంతా ఉత్తీర్ణత సాధిస్తామని, అందుకు తగ్గట్టు చదువుతామని ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, సీఆర్పీ ఓబులరాయ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ రాఘవయ్య

తూతూ మంత్రంగా గ్రామసభలు



మడకశిర మండలం కల్లుమర్రిలో గ్రామసభకు హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలు తూతూ మంత్రంగానే జరిగాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ఎంపిక, ఆమోదం కోసం ఈ గ్రామ సభలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. గ్రామ సభలకు ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రాలేదు. ప్రజలు కూడా నామమాత్రంగా హాజరుకావడంతో తూతూ మంత్రంగా సభలను నిర్వహించారు. మడకశిర మండలం కల్లుమర్రి గ్రామ సభలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రంలో జరిగిన గ్రామసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఉపాధి పనులను యంత్రాలతో కాకుండా కూలీలతో చేయించాలని డిమాండ్ చేశారు. పెనుకొండ మండలం మునిమడుగులో నిర్వహించిన గ్రామసభకు 12 మంది వార్డు మెంబర్లలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా ఉన్న సర్పంచు అశ్వర్థనారాయణ, వైస్ సర్పంచు వెంకటరెడ్డితో పాటు 10 మంది గైర్హాజరయ్యారు. కేవలం టీడీపీ మద్దతుతో గెలుపొందిన ఇద్దరు వార్డు మెంబర్లతో గ్రామ సభను తూతూ మంత్రంగా నిర్వహించారు.

‘టంగుటూరి’కి ఘన నివాళి



చిలమత్తూరు గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



రొద్దం మండలం సానిపల్లిలో ప్రకాశం పంతులు జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: ఆంధ్ర కేసరి, ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని మండలంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టంగుటూరి చేసిన సేవలను గ్రంథాలయాధికారి మల్లికార్జున కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

అగళి: మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు బీసీ హాస్టల్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలను బీసీ హాస్టల్ వార్డెన్ సికిందర్ బాషా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గేయాలను ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర కేసరి బ్రిటీష్ వారితో పోరాడిన సందర్భాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణస్వామి, కృష్ణానాయక్, సత్యమయ్య, మోహన్‌రెడ్డి, జయమ్మ, లక్ష్మీనరసమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అగళి: బీసీ హాస్టల్‌లో టంగుటూరికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అడవి పందుల దెబ్బకు పంట నష్టం

పావగడ: తాలూకాలోని గుండ్లహళ్లి గ్రామ పొలాల్లో సాగు చేసిన రెండు ఎకరాల్లోని వేరుశనగ పంటను అడవి పందులు నాశనం చేశాయని జిల్లా రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. రైతు సంఘం నాయకులతో కలసి దెబ్బతిన్న పంటను పరిశీలించారు. సుమారు 5 ఎకరాల్లో వేసిన వేరుశనగ సాగు చేశామని, అడవి పందులు పంటను నాశనం చేయడంతో భారీ నష్టం వచ్చిందని వాపోయారు. స్థానిక వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సమీక్షించి పంట నష్టాన్ని పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

హిందూ సంఘాల కాగడాల ప్రదర్శన



కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల సభ్యులు

హిందూపురం టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపైన జరుగుతున్న దాడులను, పశ్చిమ బెంగాల్లోని ట్రైనీ డాక్టర్ హత్యాచారాన్ని నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నమార్కెట్ నుంచి మెయిన్ బజార్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ చేరుకుని నిరసన తెలిపారు. హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులు జరుగుతున్నాయని, వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మడకశిరలోనూ ఉపాధి పనులు చేపట్టాలి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి పథకం కింద పనులు చేపట్టి కూలీలను ఆదుకోవాలని 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర ఒక ప్రకటనలో కోరారు. మడకశిరను మున్సిపాలిటీగా మార్చినప్పటి నుంచి ఉపాధి పథకం పనులను నిలిపి వేశారన్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కూలీలకు ఉపాధి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అక్కంపల్లి, గొల్లహట్టి, మాశేరొప్పం, దాసరిబండ, చీపులేటి గ్రామాల్లో కూలీలు అధికంగా ఉన్నారని తెలిపారు. ఉపాధి పనులు మున్సిపాలిటీ పరిధిలో నిలిపివేయడంతో కూలీలు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు చొరవ తీసుకుని మున్సిపాలిటీ పరిధిలో కూడా ఉపాధి పనులు చేపట్టే విధంగా చూడాలని కోరారు.

తాగునీటి సమస్యకు చెక్



పాఠశాలలో బోరుబావి నుంచి వస్తున్న నీటి వద్ద ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండల పరిధలోని హాలుకూరు గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య తీరింది. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని ఎంపీపీ ఈరన్న దృష్టికి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీపీ ఈరన్న.. ఎంపీపీ నిధులతో కొత్తగా బోరుబావి తవ్వించారు. శుక్రవారం కొత్తగా మోటర్ పంపు, పైపు స్టార్టర్ ఏర్పాటు చేసి నీటిని వదిలారు. బోరు బావిలోంచి పుష్కలంగా నీరు రావడంతో విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

హెచ్ఐవీపై అవగాహన

హిందూపురం: హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహనతో పాటు అప్రమత్తత అవసరమని చైతన్య సంస్థ ప్రాజెక్టు మేనేజర్ తిప్పేస్వామి అన్నారు. జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చైతన్య సంస్థ ఎస్‌డీజీఎస్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సంక్రమించే పరిస్థితులు వివరించారు. ప్రిన్సిపాళ్లు ప్రసాద్, నాగేంద్రకుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చోళమాంబదేవి ఊరేగింపు



చోళమాంబదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక కోట వీధిలో వెలసిన చోళమాంబదేవి అమ్మవారికి శుక్రవారం భక్తులు పూజలు చేశారు. శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గౌడలు యంజేరప్ప, విశ్వనాథ్, తిప్పేస్వామి, శానుబోగరు తళారులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల ప్రాంగణం పరిశీలన

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షం వస్తే మైదానం నీటితో నిండిపోతోంది. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై గురువారం ‘సాక్షి’లో ‘దంచికొట్టిన వాన’ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈఓ 1 రాఘవయ్య శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సర్పంచుతో మాట్లాడారు. నీరు నిలవకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చర్చించారు.

అన్ని భాషలకు మూలం ‘సంస్కృతం’



మాట్లాడుతున్న ఆశావాది సుధామ

పెనుకొండ: సంస్కృత భాష అన్ని భాషలకు మూలమని డాక్టర్ ఆశావాది సుధామ పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప ఆధ్వర్యంలో ప్రపంచ సంస్కృత దినోత్సవం జరిగింది. ఆశావాది సుధామ మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన భాష అయిన సంస్కృత భాష అన్ని భాషలకు మూలమన్నారు. పాశ్చాత్య దేశాలన్నీ నేడు సంస్కృత భాష నేర్చుకోవడానికి మక్కువ చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవిశెట్టిరామన్న, యశోదరాణి, హరిప్రసాద్, నాగరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.